కథ

# అమ్మా! నన్ను మన్నించు

- విరించి

ప్రపంచంలో చెడ్డ భార్య, చెల్లి, కూతురు ఉండొచ్చు గానీ, చెడ్డ తల్లి ఉండదట ఎవరికైనా! తల్లి బిడ్డని కొట్టినా, తిట్టినా వాడి శ్రేయస్సుకే గానీ, ద్వేషంతోను పగతోను కాదుగా. డాక్టర్ ఇంజక్షన్ మన మీద కోపంతో ఇస్తాడా? అమ్మ ఔన్నత్యం గురించి ఎన్ని కథలు, కవితలు రాలేదూ!

అంతటి గొప్ప అమ్మ. నాకు జన్మనిచ్చిన అమ్మ. ఈ రోజుచావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఇన్‌టెన్సివ్ కేర్‌లో ఒంటరిగా మృత్యువుతో పోరాడుతోంది. నిశ్శబ్దంగా....నిస్సహాయంగా బయట నిలబడ్డం మించి తనేం చేయలేకపోతున్నాడు.

''రోజా పది వేలు కట్టడం, ఆవిడ్ని హింసపెట్టడం కాదు. డాక్టర్ని సరిగ్గా కనుక్కోండి పరిస్థితి ఏమిటో'' సుధ ఉదయం నుంచి ఒకటే గొడవ.

''సరేలే'' అన్నాడు గానీ తనకు కాలు చెయ్యి ఆడడం లేదు.

చిన్నప్పట్నుంచీ అమ్మ తననెలా పెంచిందో పదే పదే గుర్తుకొస్తోంది. ఓ అన్నకు, అక్కకు, చెల్లెలికి, తమ్ముడికి మధ్య పుట్టాడు తను. అటు అన్నలా పెద్దరికం లేదు. తమ్ముడిగా గారాబం లేదు. అయినా ఏ చీకు చింతా లేదు. ఆ పల్లెటూర్లో ఏటి గట్టున తన బాల్యం, ఆడుతూ పాడుతూ గడిచిపోయింది. నాన్న ఓ చిన్న భూస్వామి. నాన్న ఆ అయిదెకరాల మాగాణీలో పండీ పండక ఎన్ని యాతనలు పడ్డా తమకే లోటు రానిచ్చేవాడు కాదు. తమందర్ని కష్టపడి చదివించాడు. అమ్మ ఏనాడూ నాన్న మాటకు ఎదురు చెప్పి ఎరగదు. మండువా లోగిలి దాటి అమ్మ వీధి మొహం చూడ్డం తనేనాడు చూడలేదు. నాన్నంటే అందరికీ భయం. ఆ ఊళ్లో నాన్న ఒక్కడికే 'హంబర్' సైకిలూ, దానికి 'డైనమో లైటు' ఉండేవి. నాన్న సైకిల్ బెల్ వినిపిస్తే చాలు ఎక్కడి వాళ్లం అక్కడ గప్‌చిప్ . కొడుకులకు, కూతుళ్లకు అందరికి పెళ్లిళ్లు చేసాక, ఇక తను వచ్చిన పని అయిందనుకున్నాడేమో ఏమో ఓ రాత్రి అనాయాసంగా దైవ సాన్నిధ్యాన్ని పొందాడు. జన్మనీ, జీవితాన్ని ఇచ్చిన నాన్న పోయే నాటికి జ్ఞానాన్ని మించి తమకేం మిగల్చలేదు.

ఉద్యోగరీత్యా తలో ఊళ్లో స్థిరపడ్డా, అమ్మ మాత్రం తన దగ్గరే ఉండడానికి ఇష్టపడేది. పెద్ద కొడుకు దగ్గరికెళ్లినా, చిన్న కొడుకు దగ్గరకెళ్లినా ఓ నెల్లాళ్లుండి వచ్చేసేది. వాళ్లవి పెద్ద కుటుంబాలు కావడంతో పాటు తనకక్కడ సౌకర్యంగా ఉండకపోవడం ఒక కారణం అయితే, తన స్వభావం మరో కారణం. ఇంకో కారణం సుధ. తనైనా ఎప్పుడైనా అమ్మని విసుక్కున్నాడేమో కానీ, సుధ అమ్మకు సకాలంలో అన్నీ చూసుకునేది.

ఎనభై అయిదేళ్ల వయస్సులో కూడా తెల్లవారు జాము నాలుగు గంటలకు అమ్మ లేచి, స్నానం చేసి, దైవ నామస్మరణ చేసేది. ఉదయాన్నే లేచి అమ్మకు ఫిల్టర్ కాఫీ తనే కలిపి ఇచ్చేవాడు. దానికే అమ్మ ఎంతో మురిసిపోయేది. తను కొంత కాలంగా అమ్మను గమనిస్తూనే ఉన్నాడు. ఈ మధ్య అమ్మ సరిగా ఆహారం తీసుకోవడం లేదు. వయస్సు రీత్యా ఆకలి లేదేమో అనుకున్నాడు తను.

''నాకు సహస్ర పూర్ణచంద్ర దర్శనం అయిపోయిందిరా. ఇక నేను ఎంతో కాలం బతకలేనురా'' అంటూ ఉండేది అమ్మ.

''తాతయ్య తొంభై ఆరేళ్లు బతికాడు. నువ్వేం కంగారు పడకు. ఇంకో పదేళ్లు గ్యారంటీ'' అంటూండేవాడు తను.

అమ్మకు ఈ మధ్య ఏం తిన్నా కడుపులో నొప్పితో బాధపడుతోంది. అమ్మను నగరంలో పెద్ద డాక్టర్లందరికీ చూపించాక, ఆఖరికి డాక్టర్ రావుగారి ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఏనాడూ ఎవరి చేత చాకిరీ చేయించుకోని అమ్మకు, అప్పుడే మొదటిసారిగా సేవ చేసే అవకాశం తనకువచ్చింది. రాత్రి పగలూ పక్కనే ఉండి అమ్మకు సేవలు చేస్తూనే ఉన్నాను. రకరకాల పరీక్షలతో నాలుగు రోజులకే అమ్మ మరీ నీరసించిపోతే, తనే మంచం మీద మలమూత్రాదులు పట్టేవాడు. ఓ నాలుగు రోజులకు అన్న, అక్క, తమ్ముడు, చెల్లెలు అందరూ వచ్చారు. అప్పట్నుంచి హడావుడి మొదలయ్యింది. వచ్చిన మిత్రులు, బంధువులు నగరంలోని పెద్ద కార్పొరేట్ హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యమని, త్వరగా కోలుకుంటారని సలహానిస్తున్నారు.


డాక్టర్ రావుగారి నడిగి ''సార్ అమ్మ పరిస్థితి ఏమిటి? ఏదైనా పెద్ద కార్పొరేట్ హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యమంటారా?'' అన్నాడు.

''అమ్మగారు హెయిటస్ హెర్నియాతో బాధపడుతున్నారు. ఎక్కడకెళ్లినా ఇదే ట్రీట్‌మెంట్. ఈ వయస్సులో ఆపరేషన్ చేసి ఆవిడ్ని హింసించడమే కానీ, ఉపయోగం లేదు'' అన్నారు డాక్టరు రావుగారు.

''ఎనీ హౌ...లెట్ అజ్ కనసల్ట్ డాక్టర్ రాధాకృష్ణ'' అన్నారు తనే మళ్లీ.

కన్నతల్లికి సేవ చేస్తున్నాననే తృప్తి తనకు మిగిలింది. ఎప్పుడూ బిజీగా ఉండే తను అమ్మ పక్కన కూర్చుని కబుర్లు చెపుతున్నాడు. బంధువులు, మిత్రులు రాకతో అంత బాధలోనూ అమ్మ మొహంలో ఉత్సాహం కనిపిస్తోంది. ఆ మర్నాడే కార్పొరేట్ హాస్పిటల్ నుంచి డాక్టర్ రాధాకృష్ణని రప్పించారు. డాక్టర్ రావుగారు ఆయనకు అన్ని వివరాలు చెప్పారు.

''డాక్టర్ రావు గారు చెప్పినట్లు ఆవిడ 'హైటస్ హెర్నియా'తో బాధపడుతున్నారు. అందుకే ఆహారం, నీరు తీసుకోలేకపోతున్నారు. దీనికి ఒకటే మార్గం. లేప్రోస్కోపిక్ సర్జరీ చెయ్యాలి. కోతలేవీ ఉండవు. చిన్న చిన్న హోల్స్ పెడతాం. నలభై ఎనిమిది గంటల్లో ఇంటికి తీసుకుపోవచ్చును. మీకు ఓకే అయితే రేపు ఉదయం కార్పొరేట్ హాస్పిటల్‌లో



జాయిన్ చెయ్యండి'' అన్నారు.

లాప్‌టాప్ ఓపెన్ చేసి ఆపరేషన్ ఎలా చేస్తారో, ఎంత చిన్నదో చూపించారు. తామంతా మంత్రముగ్ధులయ్యాం.

''ఇంత చిన్న ఆపరేషన్‌కు భయం ఎందుకు? రేపే జాయిన్ చేద్దాం'' అన్నాడు తమ్ముడు. అందరూ తలూపారు. నాకయితే మనస్కరించడం లేదు. అయితే, వేరే మార్గం లేదు.

ఆ మర్నాడు అంబులెన్స్‌లో తీసుకెళ్లి అమ్మను కార్పొరేట్ హాస్పిటల్‌లో జాయిన్ చేసాం.

''వద్దురా నాన్నా! నన్ను ఇంటికి తీసుకుపొండి'' అంటోంది అమ్మ.

''అమ్మా! ఇది పెద్ద హాస్పిటల్. మంచి డాక్టర్స్ ఉంటారు. రెండు రోజుల్లో హాయిగా ఇంటికి పోదాం!'' అక్కయ్య అంటోంది.

''కన్నా! నువ్వు ఎక్కడికీ వెళ్లొద్దురా! నా దగ్గరే ఉండు''

అమ్మ తన చెయ్యిని గట్టిగా పట్టుకుంది.

''నేనెక్కడికీ వెళ్లను. నీ దగ్గరే ఉంటాను. నువ్వు ధైర్యంగా ఉండు'' అన్నాడు తను.

మొదట ఎమర్జన్సీ వార్డులోకి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్స్, నర్సులు హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరి పన్లు వాళ్లు చకచకా చేస్తున్నారు.

''మీరు మొదట ఇరవై వేలు కట్టి అడ్మిషన్ నోట్ తీసుకురండి'' అంటూ ఎమర్జన్సీ వార్డు ఇన్‌చార్జి చిన్న కాగితం తన చేతిలో పెట్టాడు.

తను వెంటనే వెళ్లి డబ్బు కట్టి రసీదు తెచ్చాడు. ఈ లోపు అమ్మను ఐసియులో పడుకోబెట్టారు. ముక్కుల్లో, నోట్లో, చేతులకు, కాళ్లకు

ఏవేవో తగిలించారు. సెలైన్స్, ఆక్సిజన్ వగైరా ఎక్కిస్తున్నారు. ఇంతలో డాక్టర్ రాధాకృష్ణ వచ్చారు. అమ్మను పరీక్షించి డ్యూటీ డాక్టర్‌తో మాట్లాడారు. ఇవ్వవల్సిన మందులు రాసి ఇచ్చారు.

''షి విల్ బి ఆల్‌రైట్. డోన్ట్ వర్రీ'' తనతో చెప్పి హడావుడిగా వెళ్లిపోయారు.

''మీరు బయట రిసిప్షన్ దగ్గర కూర్చోండి. అవసరమైతే పిలుస్తాం'' సిస్టర్ చెప్పింది.

ఇక అటెండెట్స్ పేషెంటును చూసేది సాయంత్రం ఐదు, ఆరు మధ్య మాత్రమే. అమ్మను ఒంటరిగా ఇంటెన్సివ్ కేర్‌లో వదిలి రావాలంటే బాధగానే ఉంది. ఆమెకు మనుష్యులు, మాటలు కావాలి.

''అమ్మా! ఇక్కడే ఉంటాం'' అని చెప్పి బయటకు వచ్చాం. అందరం ఉదయం కాఫీ తాగాం. మళ్లీ ఏం తినలేదు. మధ్యాహ్న భోజనం వేళ అయ్యింది. ఒక్కొక్కళ్లు ఉండలేక కేంటీన్‌కు పోయి వస్తున్నారు. అమ్మ భోజనం చేసి రెండు రోజులయ్యింది. తనకు భోజనం చెయ్యబుద్ధి కాలేదు. ఇంతలో మెడిసిన్స్ కావాలని, ఫార్మసీలో ఇరవై వేలు కట్టమని కబురు. హుటాహుటిన వెళ్లి డబ్బు కట్టి వచ్చాడు తను. అవసరమైనప్పుడు ఐసి వాళ్లు మెడిసిన్స్ డ్రా చేసుకుంటారట.

సాయంత్రం ఐదు అవగానే అందరం ఇన్‌టెన్సివ్ కేర్ దగ్గరకు వెళ్లాం. ఒకళ్ల తర్వాత ఒక్కళ్లు అమ్మను చూసొస్తున్నారు. ఆఖర్న తను వెళ్లాడు. తనను చూడగానే అమ్మ కళ్లలో వెలుగు కనపడింది. అయినా అమ్మ మాట్లాడే పరిస్థితిలో లేదు. అమ్మ తల మీద చెయ్యి వేసి నిమిరా.

''ఒక్క రెండు రోజులు ఓపికపట్టు. తగ్గిపోతుంది. వెళ్లిపోదాం'' అన్నాడు తను.

అమ్మ ఏదో మాట్లాడబోయింది. మాట రాలేదు. ఏదో సౌంజ్ఞ చెయ్యడానికి ప్రయత్నించింది. అర్థం కావడం లేదు. ఇంతలో టైం ఆరు అవడంతో ఐసిలోంచి బయటకురాక తప్పింది కాదు.

రెండు రోజులకు అమ్మ పికప్ అయినట్లు కనిపించింది. కళ్లు తెరిచి చూస్తోంది. కాస్త నెమ్మదిగా మాట్లాడగలుగుతోంది. మందులు తీసుకొని ఐసియులోకి వెళ్లగానే తన కేసి చూసింది. అమ్మ కాస్త కోలుకున్నందుకు ఆనందంగానే ఉంది. దగ్గరగా వెళ్లి అమ్మను పరిశీలనగా చూసా. అమ్మ చేతులంతా సూదులు గుచ్చిన ఆనవాళ్లతో వాచిపోయాయి. రెండు చేతుల వేళ్లు బెడ్‌కు చిన్న గాజ్ క్లాత్‌తో కట్టేశారు. తనకు చాలా బాధ అనిపించింది.

''సిస్టర్'' ఇంచుమించు అరిచాను.

సిస్టర్ వచ్చింది.

''ఏమిటిది?''

''సర్! ఆమె అన్నీ పీకేసుకుంటున్నారు. మళ్లీ మళ్లీ అమర్చాలంటే ఆమెకే ఇబ్బంది కదా సర్'' నర్స్ నెమ్మదిగా చెప్పింది.

''మరి మీరెందుకున్నారు? ఆమె అవన్నీ పీకేసుకోకుండా చూడ్డానికే కదా. ఆ చేతులు కట్టేయడం ఏమిటి ఆటవికంగా?'' కోపాన్ని కంట్రోలు చేసుకుంటూ అన్నాడు తను. ఆమె కట్లు విప్పేసింది. అమ్మ కళ్ల నుంచి నీళ్లు చెంపల మీదుగా కారుతున్నాయి.

''అమ్మా! నేనున్నాను. నీకేం ఫర్వాలేదు'' అన్నాడు తను.

''నాల్గురోజులయ్యిందిరా కన్నా! అన్నం తిని... ఇంటికెళ్లి అన్నం తిని మళ్లీ వద్దాం'' అమ్మ ఒక్కొక్క మాట నెమ్మదిగా అంటోంది.

నా ఆకలెరిగి అడక్కుండానే అన్నం పెట్టే అమ్మ....గోరు ముద్దలు తినిపించిన అమ్మ....నాల్గు రోజుల్నుంచి అన్నం తినక ఆకలి అంటే....ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

''ఒక్కరోజు ఓపిక పట్టమ్మా...రేపు వెళ్దాం'' అన్నాడు తను.

అమ్మ నాకేసి దీనంగా చూసింది.

''నాన్నా! నేను బతకనురా?'' అంది.

''ఛ.....అలా అనకు. ఇది చాలా పెద్ద హాస్పిటల్. ఇక్కడ చాలా పెద్ద డాక్టర్స్ ఉన్నారు. నీకేం భయంలేదు.'' అమ్మకు ధైర్యం చెపుతున్నానే గానీ నాకూ భయంగానే ఉంది.

ఆ వయస్సులో ఆవిడకు ఆపరేషన్ అని చెప్తే ముందే ఆవిడ గుండె ఆగిపోతుంది.

అమ్మ తన చెయ్యి పట్టుకుంది.

''ఓ పది రూపాయలు ఇవ్వరా..'' అంది.

''ఎందుకమ్మా?'' అన్నాడు తను ఆశ్చర్యంగా.

''నర్సుకివ్వాలి. రాత్రి నాకు మోషన్ అయితే ఆమె తీసింది.''

అమ్మ ఎవర్కి ఋణపడదల్చుకోలేదు.

''సరే! నేను ఇస్తాలే'' అన్నాడు తను.

''నాకు ఇవ్వరా! నేను ఇస్తాను'' అమ్మ తన



చెయ్యి గట్టిగా పట్టుకుంది.

పక్కనే ఉన్న సిస్టర్ నవ్వుతోంది. మామ్మగారి ఛాదస్తం చూసి.

జేబులోంచి పదిరూపాయల నోటు తీసి అమ్మ బెడ్ మీద పెట్టాడు తను. అమ్మ ఆ పది రూపాయలు తీసుకొని సిస్టర్‌కిచ్చింది. సిస్టర్ 'వద్దు మామ్మగారూ' అంటూ నవ్వుతూ తీసుకుంది.

''థాంక్యూ మామ్మగారు'' అంది.

అమ్మ కళ్ళలో ఆనందం. ఆ పదిరూపాయలతోనే అమ్మతో తనకు ఋణం తీరిపోతుందని తెలియదు. ఆ మర్నాడు ఉదయం అందరం ఐసి దగ్గరకు వెళ్లేటప్పటికే అమ్మను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిపోయారు. అందరం ఆపరేషన్ థియేటర్ బయటే కూర్చున్నాం. సుమారు నాల్గు గంటల తర్వాత డాక్టర్ ఆపరేషన్ థియేటరు నుంచి బయటకు వచ్చాడు. తను దగ్గరకు వెళ్లి విష్ చేసాడు.

''ఆపరేషన్ పూర్తయింది. వెంటిలేటర్ అమర్చాం. రెండు మూడు గంటల తర్వాత తీసేస్తాం. ఓకే!'' అన్నారు డాక్టరు రాధాకృష్ణ.

''హౌ ఈజ్ ద పేషంట్ డాక్టర్?''

''షి ఈజ్ ఆల్‌రైట్. ఓకే!'' అంటూ డాక్టర్ వేగంగా వెళ్లిపోయాడు.

ఓ పావు గంట పోయాక అమ్మను ఆపరేషన్ థియేటర్ నుంచి తీసుకొచ్చి ఐసిలో పెట్టారు. అమ్మ స్పృహ లేకుండా ఉంది. వెంటిలేటర్ కారణంగా ఛాతి పైకి కిందకీ కదులుతోంది. తల ఒక పక్కకు వాల్చి ఉంది. ఇక చేసేదేమి లేక క్యాంటిన్‌కి వెళ్లి లంచ్ అయ్యిందనిపించాం. మళ్లీ వచ్చి రిసెప్షన్‌లో కూర్చున్నాం. ఫార్మశీకెళ్లి ఎంక్వయిరీ చేస్తే కట్టిన ఇరవై వేల రూపాయలు ఐసి వాళ్లు డ్రా చేసారని మరో ఇరవై వేలు కట్టమంటే కట్టాడు. సాయంత్రం నాల్గు గంటలకు డాక్టర్ రాధాకృష్ణ వచ్చాడు. తను వెళ్లి, ''సర్,! ఎట్లా ఉంది అమ్మకు?'' అడిగాడు ఆతృతగా.

''షీ ఈజ్ ఆల్‌రైట్.. ఎక్సెప్ట్ షీ ఈజ్ నాట్ పాసింగ్ యూరిన్. ఉయ్ హేవ్ రిఫర్డ్ దిస్ టు నెఫ్రాలజిస్ట్.... ఓకే?'' డాక్టర్ సంభాషణ అంతా ఇంగ్లీష్. డాక్టర్ తన సమాధానం కోసం చూడకుండా వెళ్లిపోయాడు. ఆ సాయంత్రం ఐసికి వెళ్లి చూస్తే అమ్మ నిశ్చలంగా పడుకుంది. వెంటిలేటర్ మూలంగా అంతకు ముందులా ఛాతి ఒకటే పైకి కిందకీ కదులుతోంది.

ఆ మర్నాడు ఉదయం డాక్టర్ రాధాకృష్ణ పదకొండు గంటల దాకా రాలేదు. ఆ తర్వాత ఆపరేషన్స్ అని సాయంత్రం నాలుగు గంటలదాకా కనపడలేదు. సెల్‌కు ట్రై చేస్తే ఎత్తడు. ఐదు గంటలకు దొరికాడు.

''షి ఈజ్ ఆల్‌రైట్. బట్ బిపి బాగా డౌన్ అయ్యింది. హార్ట్ బీట్ తగ్గింది. కార్డియాలజిస్ట్‌కు రిఫర్ చేసాం ఓకే?'' ఆయన వెళ్లిపోయాడు.

ఆ రాత్రి తెల్లవార్లూ అన్నయ్య, తను తమ్ముడు రిసెప్షన్ బయట కునికిపాట్లు పడ్తూ కూర్చున్నాం.

తెల్లవారగానే ఐసిలోకెళ్లి అమ్మను చూసాం. అమ్మలో ఏ కదలికా లేదు. రెండు మూడు గంటల తర్వాత తీసేస్తామన్న వెంటిలేటర్ అలాగే ఉంది. ఇంతలో డాక్టర్ రాధాకృష్ణ వచ్చారు.

''ఈరోజు హైదరాబాద్ నుంచి డాక్టర్ రాజేశ్వరరెడ్డిగారని గాస్ట్రో ఎంటరాలజిస్ట్ వస్తున్నారు. ఒకసారి ఆయనకు చూపిద్దాం ఓకే?'' అన్నాడాయన.

''ఎందుకు సార్?''

''మెడికల్‌గా కొన్ని కాంప్లికేషన్స్ ఉన్నాయి అందుకని. ఓకే?'' ఆయన యధాప్రకారం హడావుడిగా వెళ్లిపోయారు.

ఆ సాయంత్రం యాభైవేలు కట్టమని ఒక నోట్ నిచ్చారు. తనకెందుకో ఏదో గందరగోళంగా కనిపిస్తోంది. ఆపరేషన్ అయిన నలభై ఎనిమిది గంటల్లో ఇంటికి వెళ్లిపోవచ్చన్న వ్యక్తి ఆ విషయాన్ని మరిచిపోయి ఏవేవో కాంప్లికేషన్స్ చెపుతున్నారు. ఏటీఎంలో యాభైవేలు డ్రా చేసి కట్టాడు తను. ఎప్పుడైతే యాభైవేలు కట్టమని చెప్పారో పరిస్థితి సీరియస్ అని అర్థమైంది. ఫార్మసీ కెళ్లి అడిగితే ఉదయం నుంచి మందులు డ్రా చెయ్యలేదని తెలిసింది. అంటే కొత్తగా మందులేం వాడడం లేదు. రోజుకో సమస్య చెపుతున్నారు.

ఆ మర్నాడు డాక్టర్ రాధాకృష్ణ రమ్మంటే వెళ్లాడు తను.

''అమ్మగారికి ఎప్పుడైనా షుగర్ ఉందా?'' అన్నారు.

''లేదు సార్'' అన్నాడు తను.

''ప్రస్తుతం షుగర్ చాలాఎక్కువగా ఉంది. ఎండోక్రానాలజిస్ట్‌కు రిఫర్ చేసాం ఓకే?'' అన్నారు.

తనకేం చెయ్యాలో తోచలేదు. పేషెంటు సుశీలమ్మగారి తాలుకూ రావాలంటూ రిసెప్షన్ దగ్గర మైక్‌లో ఎనౌన్స్ చేసారు. తమ్ముడు, తను వెంటనే ఐసి కెళ్లాం.

''ఈ మందులు అర్జంటుగా కావాలి సార్'' సిస్టర్ చేతిలో చీటీ పెట్టింది.

''ఇదేమిటి? ఫార్మసీలో డబ్బు కట్టాం కదా?'' అన్నాడు తను.

''అయితే, ఓకే సర్.''


''ఇంతకీ.....పేషెంటు కండిషన్ ఎలా ఉంది?'' అన్నాడు తను ఆతృతగా. సిస్టర్ మాట్లాడకుండా


నమ్మించి మోసం చేసిందామె. దాంతో ఆమెను చంపేశాడతను. చంపేసిన తర్వాత తెలిసింది. ఆమె తనని మోసం చెయ్యలేదని. నిజం తెలుసుకున్న అతను ఆమె చితి దగ్గర కన్నీరు మున్నీరుగా విలపించాడు. బూడిదగా మారిపోయిన ఆమెను దోసిళ్ళతో తీసుకుని గుండెలకు అదుముకున్నాడు. కాటి కాపరి కసిరితే ఆ రాత్రి...ఆ చీకటిలో వెను తిరిగి జన సంద్రంలో కలిసిపోయాడు. అలా కలసిపోయిన అతను ఎక్కడ తేలాడు? ఏ తీరాన నిలిచాడు?

ప్రముఖ రచయిత్రి 'అరణి' సంచలన సృష్టి

సముద్రం మీద సంతకం

సీరియల్ త్వరలో ప్రారంభం




డాక్టర్ కేసి చూసింది.

''సర్! పేషెంటు కండిషన్....?'' డ్యూటీ డాక్టరును అడిగాడు తను.

''కొంచెం కాంప్లికేటెడ్‌గానే ఉంది. డాక్టర్ రాధాకృష్ణగార్ని కన్సల్ట్ చేయండి.''

''ఇక మీరెందుకు? పేషెంటు కండిషన్ తెలియకుండానే డ్యూటీ చేస్తున్నారా?'' తమ్ముడు ఆవేశంగా అరిచాడు. ఆవేశం తగ్గించుకోమని రాఘువ చెయ్యి నొక్కా.

''చెప్పాను కదా! కాస్త సీరియస్‌గానే ఉంది'' నెమ్మదిగా గొణిగాడు డ్యూటీ డాక్టర్.

నెమ్మదిగా బయటకు నడిచాం. అమ్మ మృత్యువుతో పోరాడుతోందని అర్థమయ్యింది. నిస్సహాయంగా బయట కూర్చోవడం తప్పితే తామేం చేయలేకపోతున్నాం.

''బాబాయ్! మనస్సు దిటవు చేసుకో. ప్రిపేర్ ఫర్ ది వరస్ట్. అందర్కి ఇన్‌ఫార్మ్ చెయ్యి'' సుదీప్ కంఠం వినగానే ఆలోచనల్లోంచి ఈ లోకంలోకొచ్చి పడ్డాను. సుదీప్ మా కజిన్ కొడుకు. వాడు ప్రస్తుతం హౌస్ సర్జన్ చేస్తున్నాడు. వాడు ఐసిలోకి పోయి రాగానే ఈ విషయం చెప్పాడు.

వెంటనే రాఘువను తీసుకొని అన్నయ్య కొడుకు సుబ్రహ్మణ్యంతో ఐసిలో కెళ్లాను. నా కెందుకో కాళ్లు వణుకుతున్నాయి. వెంటిలేటర్ సాయంతో ఛాతి పైకి కిందకీ ఆడడం లేదు. అమ్మ పక్కనే ఉండే డ్యూటీ నర్స్ దూరంగా ఎక్కడో వేరే పనిలో ఉంది. హాస్పిటల్ సిఎంవో అక్కడ డ్యూటీ డాక్టర్‌తో ఏదో చర్చిస్తున్నాడు. గుండె దడదడలాడుతుండగా దగ్గరకెళ్లాను. సిఎంవో నా భుజం మీద చేయి వేసాడు.

''సుశీలమ్మగారు మీ కేమవుతారు?'' అన్నాడు

''అ....మ్మ...'' అన్నాను గొంతు పెగల్లేదు.

''మీ పేరు?''

''వేణు''

''సారీ మిష్టర్ వేణు! వియ్ హావ్ డన్ అవర్ బెస్ట్. కార్డియాక్ అరెస్ట్. ఇప్పుడే... జస్ట్...10.22కి''

''యూ మీన్....షీ ఈజ్ నో మోర్?''

''ఎస్! ఐ యామ్ వెరీ సారీ''

నాలో ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది.

''ఏమిటి సార్ ఇది? మరీ ఇంత అన్యాయమా? కనీసం కండిషన్ సీరియస్ అనే విషయం కూడా మాకు చెప్పరా? నలభై ఎనిమిది గంటల్లో ఇంటికి తీసుకుపోవచ్చన్న డాక్టర్ రాధాకృష్ణ ఎక్కడ?'' తమ్ముడు ఆవేశంగా అరుస్తున్నాడు.

''ఏమిటి సార్? మీకేమైనా టీవియో, ఫ్రిజో రిపేరుకిచ్చామా?మీ కిచ్చింది లివింగ్ హ్యూమన్ బాడీ. పేషెంటు కండిషన్ ఎప్పటికప్పుడు మాకు చెప్పరా? వేలకు వేలు కట్టించుకోవడమేనా మీ పని? పేషెంటు జాయినయ్యేటప్పుడు లేని బిపి, షుగర్, రీనల్ ఫెయిల్యూర్, కార్డియక్ అరెస్ట్ వగైరా ఎక్కడ నుంచి వచ్చాయి? మీకు చేతకాకపోతే మాకు చెప్పవచ్చు కదా?'' సుబ్రహ్మణ్యం గట్టిగా నిలదీస్తున్నాడు.

నేను రెండు చేతులు ఎత్తి నమస్కారం పెట్టాను.

''మా అమ్మను ఇంకా హింసించకుండా విముక్తి కలిగించారు. చాలా కృతజ్ఞుడిని'' అన్నాను.

అమ్మ మొహం కేసి చూసాను. అమ్మ నిశ్చింతంగా నిద్రపోతున్నట్లుంది. ''అమ్మా!'' అని భోరున ఏడవాలనుంది. కానీ ఏడవలేకపోతున్నాను. మెదడు మొద్దుబారిపోయింది. అమ్మ ఎనభయ్యయిదేళ్ల జీవన సమరం ఆ రోజుతో ముగిసింది. నన్ను నవ మాసాలు మోసి, కని ఎన్నో త్యాగాలు చేసి పెంచిన అమ్మ, తన ఋణం నేను తీర్చుకోకుండానే, తనకు చెప్పకుండా ఆపరేషన్ చేయించి, హింసించి, అమ్మకెంతో అన్యాయం చేసాను. ఆమె జీవించే హక్కును హరించేసాను. కడసారి ఆమె ఏమి చెప్పాలనుకుందో....అంతిమ సమయంలో ఒంటరిగా....పక్కన నా అన్నవాళ్లు ఎవరూ లేకుండా.....ఎంత మరణయాతన అనుభవించిందో? భగవాన్! అమ్మ కెంత ద్రోహం చేసాను! అమ్మా! నన్ను మన్నించు. కార్పొరేట్ హాస్పిటల్ మోజులో, ఆధునిక సౌకర్యాలున్న గొప్ప హాస్పిటల్‌లో వైద్యం చేయిస్తున్నానన్న భ్రమలో, లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నానన్న అహంలో, అవసాన దశలో ఆత్మీయుల మధ్య తనువు చాలించే అదృష్టాన్ని దూరం చేసా. మనస్సు విలవిలాడుతోంది. రెండు కళ్లు ధారాపాతంగా వర్షిస్తుంటే, మౌనంగా బయటకు నడిచా.

*

చిరునామా
విరించి
తల్లాప్రగడ గోపాలకృష్ణ
ఎస్-5, శివ అపార్ట్‌మెంట్స్
చావలవారి వీధి, గాంధీనగర్
కాకినాడ-533004
సెల్: 9848789094